అఖిలాంధ్ర రచయిత్రిగా పేరుపొందిన ఆమె తనరచనలోని తప్పు ఎలా గ్రహించింది?

# నీవు నేర్పిన...

## యార్లగడ్డ సరోజినీదేవి కథ

కాలేజీ నుంచి యింకా రాని కూతురు కావ్య కోసం ఎదురుచూస్తూ కూర్చుంది సరస్వతి.

అలా అయిదు గంటల నుంచీ ఆరున్నర వరకూ సోఫాలో నుంచి లేవలేదు. పదే పదే టైము చూసుకుంటోంది.

వెళ్ళిన కారు, డ్రైవర్ తిరిగి రాలేదు. తను మహిళా మండలి మీటింగ్‌కి వెళ్లాల్సిన టైం దాటిపోయింది. ఇప్పటికే తాను రాలేదేమిటని ఫోనుల మీద ఫోనులు! సభ్యుల మీటింగ్‌కి ప్రెసిడెంటు వెళ్ళకపోతే మీటింగ్ మరుసటి రోజుకి వాయిదా వేసుకుంటారు. పోనీ ఏ కారణం చేతనయినా కారు తిరిగి రావటం ఆలస్యం అయినా తను ఆటోలో వెళ్లవచ్చును.

కాని అలా ఆటోలో వెళ్లాలంటే సరస్వతికి ఎంతో నామోషి.

తను గొప్ప రచయిత్రిగా, ఎనభై నవలలు వ్రాసింది. అందులో కొన్ని నవలలు సినిమాలుగా వచ్చాయి. యువత మనసులలో కల్లోలం రేపే రచనలు చేయటంలో ప్రావీణ్యతగలది. అంతదాకా ఎందుకు ఆంధ్రుల ఆరాధనా రచయిత్రిగా, నవరసాలూ పలకించగల రచయిత్రిగా తనకొక సమున్నతమయిన స్థానం యిచ్చారు పాఠకులు.

ఆఖరికి షాపింగ్‌కి వెళ్లినా 'రచయిత్రి'గా పు వచ్చారు.

'అందాల అతివ' నవల వ్రాసింది ఆమెగారే!'

'ఆ నవల ఎంత బాగుంటుందని??'

'అప్పుడే చదవటం అయిపోయిందా?'




అన్నంత యిది కలిగించుతుంది!''

'ఆ నవల చదువుతుంటే ఎంత థ్రిల్లింగ్‌గా వుంటుందో?'

'మాటలతో వర్ణించలేనిది!...'' లాంటి వ్యాఖ్యానాలు సేల్సు బాయిస్, గరల్స్ నుంచి ఆఖరికి సామాన్య గృహిణి నుంచి కాలేజీ అమ్మాయిల నోటన కూడా సరస్వతి పేరు నానటమే!

సరస్వతి సీరియల్ వస్తున్నదంటే ఆ వారపత్రిక కోసం నాలుగు వారాల ముందే ఏజంటు దగ్గర కాపీ బుక్ చేసుకునేవారు.

సీరియల్ నడుస్తున్నంతకాలం ఏ యింట చూసినా, ఏ క్లబ్బులోనయినా, ఆఖరికి కాలేజీ వెయిటింగ్ రూములలో పాఠ్యాంశాలను మరిచి ఆ సీరియల్‌లోని హీరోహీరోయిన్ మధ్య నడిచే ప్రేమ బంధం గురించే చర్చించుకునేవారు.

అదంతా కాలేజీ నుంచి వచ్చాక కావ్య వివరించి చెప్పుతుంటే సరస్వతి ఎంతో ఆనందపడేది. మరెంతో గర్వపడేది.

తాను ప్రముఖ రచయిత్రిగా అంతటి సముచిత స్థానం సంపాదించుకోవటం వలననే తన కూతురి పేరు 'కావ్య'గా పెట్టుకున్నది.

'మీ నవల 'ఆశయాలు' చదివిన తరువాత నాలో చాలా మార్పు వచ్చింది. వరకట్నం అంటేనే అసహ్యం వేసింది. మా నాన్నకి యిష్టం లేకపోయినా సరే, నేను ప్రేమించిన అమ్మాయినే వివాహం చేసుకుంటున్నాను. మీరు వచ్చి మా దంపతులను ఆశీర్వదించితే అదే చాలు!'' అంటూ ఒక యువకుదు వస్తే తానా పెళ్ళికి వెళ్లింది.

'నా రచనవలన ప్రభావితడయి వరకట్నం లేకుండా వివాహమాడిన ఆ యువకుడిని మనస్పూర్తిగా అభినందించింది.

మరొక కాలేజీ అమ్మాయి వచ్చింది సరస్వతి దగ్గరకు.

ఆ అమ్మాయి హైకోర్టు జడ్జి కూతురు. కావ్య కంటే సీనియర్. అందమూ, ఆస్తీ, అంతస్తూ వున్న వారింటి అమ్మాయి.

రోజుకో నవల కొని చదివేయటమే ఆ అమ్మాయి పని. సరస్వతిని ఆమె రచనలను గురించి కావ్య దగ్గర అదే పనిగా పొగిడేస్తుండేది. అలాంటి అమ్మాయి సరస్వతి దగ్గిరకు వచ్చి చెప్పింది.

'మీ నవల 'మిట్టపల్లాలు' చదివి నేనీ నిర్ణయానికి వచ్చాను. కలవారి అమ్మాయి కలవారి అబ్బాయినే ఎందుకు చేసుకోవాలి? తనకెలాగు డబ్బు వుంది. అలాంటప్పుడు లేనింటి అబ్బాయిని చేసుకోవచ్చునుగా? అందులో తప్పేమి వుందండీ??' అనడిగింది.

'తప్పేమీ లేదమ్మా!... లేనివాళ్ళని ఈ రూపేణాగా పైకి తీసుకురావటం, రావాలనుకోవటం నీ గొప్ప మనసుకి తార్కాణం! నా నవల నీలో చైతన్యం తీసుకువచ్చినందుకు ఆనందించుకున్నాను. మీలాంటి యువతులే ముందుకి రావాలి! లేకపోతే ఈ దేశం బాగుపడేది ఎలా? సమానత్వం లభించేది ఎప్పుడు??'' అంటూ చిన్నసైజు ఉపన్యాసం ఇచ్చింది.

''మీలాంటి గొప్ప రచయిత్రి ఆశీర్వాదించారంటే అంతకంటే నాకు కావలసింది ఏమున్నది. నేను వివాహం చేసుకోబోయేది మా తోటమాలి కొడుకుని. అతను చదువులో బ్రిలియంట్. ఆర్థిక పరమయిన కారణాలవల్ల గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకోక చిన్న ఉద్యోగం చేసుకుంటున్నారు. నేను అతన్ని వివాహం చేసుకుని నా డబ్బుతో అతన్ని చదివించాలనుకుంటున్నాను!...''

''తోటమాలి కొడుకా?'' ''అంది

సరస్వతి నిరుత్సాహంగా!''

''మీ నవల 'మిట్టపల్లాలు'లో కారు డ్రైవర్ ముసలివాడయితే అతని కొడుకు తండ్రి స్థానంలోకి రావటం, పెద్ద బిజినెస్ మాగ్నెట్ కూతురు రోజా ఆ కారులోనే కాలేజీకి వెళ్లటం రావటంతో యిద్దరి మధ్య ప్రేమ అంకురించటం, ఆ తరువాత పెద్దలను ఎదిరించి పెళ్లిచేసుకోవటం... అని వ్రాశారుగా... అతను డ్రైవర్ కొడుకు అయితే నేను ప్రేమించింది తోటమాలి కొడుకుని! మీ నవల స్వభావం నన్నీ నిర్ణయానికి తీసుకువచ్చింది. ఏమంటారు ??''

''నేను వ్రాసినట్టుగానే మవ్వు చేయటం నాకు నిజంగానే ఆనందంగా వుంది! మీ వివాహానికి తప్పకుండా వస్తాను!...''


అనటమే కాదు, వెళ్లి ఆశీర్వదించి సమానత్వం గురించి అనర్గళంగా ఉపన్యాసం యిచ్చి మరీ తిరిగివచ్చింది.

ఆ తరువాత యింకొక ఆమె వచ్చింది. ఆమె వయస్సు ముప్పయి అయిదు సంవత్సరాలుపైనే వుంటాయిగాని అంత వయస్సుని కనిపించకుండా చేసుకున్న మేకప్‌కి ఆమెని అభినందించుకుంది మనసులోనే!

'నేను మీ కావ్య చదివే కాలేజీలో తెలుగు లెక్చరర్‌ని!..'

'ఓహో! అలాగా! కూర్చోండి!' అంది సరస్వతి.

'నేను కాలేజీలో చదువుకునేటప్పటి నుంచీ మీ అభిమాన పాఠకురాలిని. మీ కథగాని, నవలగాని మార్కెట్‌లోకి రావటంతో ముందుగా ఎంత ధర యిచ్చి అయినా కొని చదివేదాన్ని... అలా చదివి చదివి నాలో మీ ఆశయాలు, ఆదర్శాలు జీర్ణించుకుపోయాయి. ఆరు అడుగుల అందగాడు, పెద్ద బెంజికారు, మూతి మీద గుబురుగా పెంచుకునే మీసగాడు అప్పటి నుంచీ కనిపించలేదు. వెతికి వెతికి వేసారిపోయారు మా అమ్మా నాన్నా! వారు ఆ అన్వేషణలోనే అసిలి సొలసి చనిపోయారని



మా బంధువర్గమంతా అన్నది. అయినా నేను పట్టించుకోలేదు. యిప్పటికి దొరికాడు నాకు ఆరు అడుగుల అందగాడు. ఒక్క బెంజికారేమిటండీ? రోజుకోక రకం కారులో తిరుగుతుంటారు. రోజుకి ఎన్నో కారులకు అధిపతి. యిప్పుడు మేమిద్దరం వివాహం చేసుకోవాలని అనుకుంటున్నాం. చేసుకోబోయే ముందు మీ ఆశీస్సుల కోసమని వచ్చాం. అతని పేరు కాశీవిశ్వేశ్వర రావు. ముద్దుగా అందరూ 'కాశీ' అని పిలుస్తారట. నేనూ అలాగే పిలుస్తానంటే వప్పుకున్నాడు.

'కాశీ యిలారా!' అని పిలిచేసరికి బైట కూర్చున్న అతను లోపలికి వచ్చాడు.

అతన్ని చూడగానే సరస్వతి అవాక్కయి పోయింది.

కాశీ ఆ వీధి చివరవున్న మెకానిక్ షెడ్డు ఓనరు. తన కారు రిపేరు వస్తే కాశీ షెడ్డుకే పంపించుతుంది. తనకి తెలిసినంత వరకూ కాశీకి భార్య యిద్దరు పిల్లలూ వున్నారని విన్నది. మరి యిప్పుడు మరలా ఈ పెళ్లి ఏమిటి? ఎన్నో కారులకి అధిపతి అంది ఈ మెకానిక్‌నా?? షెడ్డుకి రిపేరుకి వచ్చిన కారులన్నీ అతని స్వాధీనంలో వుంటాయి. అవన్నీ అతనివిగానే భావించి జాగ్రత్త తీసుకుంటాడు. అంత మాత్రాన అతనివి ఎలా అవుతాయి??

ఆరు అడుగులు వుంటాడు. గుబురు మీసాలతో వుంటాడు. మెకానిక్ కాశీ అని అనరు. బొద్దు మీసాల కాశీ అనంటారు.

'అదేమిటి రచయిత్రమ్మగారూ? అలా చూస్తారు? నేను కాశీనండి! మీ కారుని ఎన్నిసార్లు సరసమయిన రేటుకి రిపేరుచేసి యివ్వలేదు. ఒక్క లలితగారే కాదు, నేనూ మీ అభిమాన పాఠకుడినే! మీ నవలలు నెలకొకటి మార్కెట్‌లోకి రావటంతో చది వేందుకు టైం దొరకటం లేదని యిద్దరి కుర్రవాళ్ళను పెట్టాను...' అన్నాడు.

'అవునూ! నీకు పెళ్ళయింది కదూ?' అనడిగింది సరస్వతి.

'ప్రేమకి పెళ్లి, పిల్లలు అడ్డు రారని మీరేగా 'సరాగమాల' అన్న నవలలో వ్రాశారు. అబ్బా! ఆ నవల కనీసం వందసార్లయినా చదివి వుంటానండీ! అందువలన మీ నవలలోని సారాంశం అంతా మా యిద్దరిలోనూ జీర్ణించుకుపోవట ంతో యింకా విడిచి వుండలేక పెళ్ళి చేసుకోవాలనుకున్నాం. ముందుగా మీ ఆశీర్వాచనాలు పొందాలని వచ్చాం. కావాలం టే ఆ నవల ఒకసారి మీరు చదవండి! మేము త్వరగా వెళ్లాలి!...'

అని తొందర చేస్తే నా పాఠకులు నా రచనలు చదివి ఎన్ని రకాలుగా ముందడుగు వేస్తున్నారో అర్థమయి ఆనందంతో ఉబ్బిత బ్బిబ్బు లాడిపోయింది సరస్వతి.

తను ఒక రోజున ఆటోలో మహిళా మండలికి వెళ్ళితే ఒకామన్నది??

'మీ ఆయన కారు యివ్వనన్నాడా? ఆటోలో వచ్చావు??'

తన మాటకి తన భర్త ఎదురు చెప్పటమే??... అశేష పాఠక హృదయాలలో ఆరాధ్య రచయిత్రిగా ప్రముఖ స్థానం పొందిన తను తన భర్తకి లొంగి

వుండటమా?... అసంభవం! అన్న సంగతి వాళ్ళకి తెలియక అలా అనుకున్నారు... అప్పటి నుంచి తాను కారు తప్ప మరే యితర వాహనమూ వాడదు.

ఆ కారుకోసం ఎదురు చూస్తూ కూర్చుంటే మీటింగ్ టైం దాటిపోయింది. ఠంచనుగా అయిదు గంటలకి యింటికి వచ్చేసే కావ్య ఈ రోజు ఎందుకింత ఆలస్యం చేసింది? స్పెషల్ క్లాసులేమన్నా జరుగుతున్నవేమో??...

ఏడు గంటలు కావటం, ఆ వెంటనే కారు లోపలికి రావటం ఒకేసారి జరిగిపోవటంతో సోఫాలో నుంచి లేచి నిలబడేసరికి కావ్య బదులు భర్త రామారావు దిగటంతో ఆశ్చర్యపోయింది.

'కావ్య ఏది?...' అనడిగింది.

జేబులో నుంచి చించిన కావరు తీసి భార్య చేతిలో వుంచి గబగబా లోపలికి వెళ్ళిపోయాడు.

చించిన కవరులో నుంచి మడతపెట్టిన కాగితం తీసి చదవసాగింది సరస్వతి.

'డియర్ మమ్మీ!

నువ్వు వ్రాసే ప్రతీ కథ, ప్రతీ నవల నేను నాకు చదువు వచ్చినప్పటి నుంచీ చదువుతునే వున్నాను. నాకు నీ నవలలో హీరోహీరోయిన్‌తో చెప్పించే ఆదర్శ వాక్యాలు, నన్నెంతో ఆకర్షించాయి. ఈ మధ్య నీ నవల ఆధారంగా తీసిన సినిమా 'బాంధవ్యాలు' నన్నెంతో ఆకర్షించింది. కాలేజీకి వెళ్ళకుండా రోజుకి రెండు ఆటలు చొప్పున ఈ నెల రోజుల నుంచీ చూస్తున్నాను. కలతలవల్ల విడిపోయిన రెండు కుటుంబాలను ఎలా కలిపేది? అందుకు ఏయే మార్గాలు ఆ హీరో హీరోయిన్ అమలు పరిచిందీ అత్యంత వినోధ భరితంగా వ్రాశావు. మనసుకి హత్తుకునే విధంగా వాళ్ల సినిమా తీశారు. నాకూ అనిపించింది ఆ సినిమా చూస్తుంటేను! నీకూ నాన్నగారికీ పెదమామయ్యా అంటే తగని కోపం. రాకపోకలు అనేవి లేవు ఎన్నో సంవత్సరాల నుంచి!



## పెయింటింగ్

'ఏవండీ, ఈ పెయింటు సూర్యాస్తమయమా! సూర్యోదయమా!'

'అది తప్పకుండా సూర్యాస్తమయమే. ఈ పెయింటర్ నాకు బాగా తెల్సు. ఆయన జీవితంలో నాకు తెల్సి ఎప్పుడూ సూర్యోదయం చూడలేదు'. ఆయన నిద్రలేచే సరికి పది దాటుతుంది.

– పద్మావతీదేవి (నిడుబ్రోలు)

ఆ పెదమామయ్యకి ఓ కొడుకు వున్నాడని, అతను టెన్త్‌క్లాసు తప్పి వ్యవసాయం చేసుకుంటున్నాడని నా అన్వేషణలో తెలుసుకున్నాను. బావను రప్పించి నా మనసులో మాట చెప్పి ఈ పెళ్లికి వప్పించాను. నీకు ముందుగా తెలియచేస్తే నువ్వు అంగీకరించవని నీకు చెప్పకుండా బావతో లేచిపోతున్నాను. ఉత్తరం వ్రాసి యిస్తున్నాను డ్రైవర్‌కి... నువ్వు 'బాంధవ్యాలు'లో సరిగ్గా యిలాగే వ్రాశావు. సినిమాలో కూడా ఆ సన్నివేశాన్ని ఏ మాత్రం మార్చకుండా తీశారు. నేనూ అలాగే చేశాను. బాంధవ్యాలకి అద్దం యిదేనని రచయిత్రిగా అనేకానేక నవలలు వ్రాసి అశేష ఆంధ్ర ప్రేక్షకుల ఆరాధ్య రచయిత్రిగానే కాక ఎంతో మందికి మార్గదర్శకమయిన నీ నవలలు యింకెంతో మందికి స్ఫూర్తినివ్వాలని ఆశించుచున్నాను...

నీ కావ్య!...

చదివిన సరస్వతి నిర్వణ్ణురాలయి పోయింది.

ఎందరినో ఆశీర్వదించిన సరస్వతి తన కూతురిని మాత్రం ఆశీర్వదించలేకపోయింది.

తను ముద్దుగా 'కావ్య' అని పేరు పెట్టుకున్న సరస్వతి యిప్పుడు ఆ కావ్య ఎదురు తిరిగే సరికి భిన్నురాలయిపోయింది.

అందరితోపాటు తన కూతురు కూడా పక్కదారిలోకి వెళ్లినందుకు అమితంగా బాధపడటం మినహా మరేమీ చేయలేకపోయింది.

ఆ సంవత్సరమే 'బాంధవ్యాలు' సినిమా కథకి ఉత్తమ రచయిత్రిగా అవార్డు వచ్చినా స్వీకరించటానికి తిరస్కరించింది సరస్వతి.

యువతీ యువకులను పక్కదారులు పట్టించిన తన రచనలు యింక ఎవరూ చదవకూడదని, అలా చదవకుండా వుండటానికి అన్నట్లు కావ్య దూరమయిన రోజుకీ అస్త్ర సన్యాసంచేసినట్టు కాగితాలను కుప్పగా పోసి తగలబెట్టింది. ఇంకు బాటిల్‌ని చెత్త కుప్పలో పారవేయించింది. గేటు మీద

'ఎ.సరస్వతి... రచయిత్రి!'

అన్న బోర్డు ఎన్నో సంవత్సరాల నుంచి వుంటోంది.

దాన్ని తీసి ముక్కలు ముక్కలు చేయించింది....

